ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 19 ఏప్రిల్ 2024

గతేడాది ఇచ్చిన హామీలు ఇలా..

● పలాసలో గతేడాది డిసెంబరు 14న సీఎం జగన్మోహన్ రెడ్డి భారీ సభ నిర్వహించారు. పలాస-కాశీబుగ్గ మునిసిపాల్టీ అభివృద్ధికి రూ.5కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికీ ఈ నిధులు మంజూరు కాలేదు. ● నౌపడ-కోసంగిపురం రెండు వరుసల రోడ్డు విస్తరణకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. కానీ ఈ రోడ్డు విస్తరణకు సంబంధించి ఎటువంటి ప్రగతి కూడా లేదు. ● వంశధార నీరు సముద్రంలో కలసి వృథాగా పోతుందని.. ఎత్తిపోతల పథకం మంజూరుచేయాలని మంత్రి సీదిరి అప్పలరాజు సభలో సీఎంను కోరారు. ఇందుకు స్పందించిన సీఎం.. వంశధార నీరు సముద్రంలో కలవకుండా బెండిగేటు వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణానికి అవసరమైన రూ. 7 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఇందుకు సంబంధించి కనీస కదలిక కూడా లేదు.



- ముఖ్యమంత్రి ఇచ్చిన వాటికే దిక్కులేదు
- పలాసలో నెరవేరని జగన్ వాగ్దానాలు
- తితలీ బాధితులకు రెట్టింపు పరిహారమేదీ?
- కిడ్నీ రోగులకూ అరకొర సేవలే
- ఐదేళ్లు పూర్తవుతున్నా.. కానరాని ప్రగతి

ఆ హామీలు.. హుష్ కాకి!




తితలీ తుఫాన్‌కు ధ్వంసమైన కొబ్బరి తోట (ఫైల్)

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)


వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు జిల్లాలోనే పాదయాత్ర ముగించారు. ప్రతి నియోజకవర్గంలోనూ సభలు నిర్వహించి.. జిల్లావాసులకు ఎన్నో హామీలిచ్చారు. 'ఒక్క చాన్స్' ఇస్తే ఏళ్ల తరబడిగా ఉన్న సమస్యలను కూడా పరిష్కరించి.. అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రకటించారు. ఆయన ప్రకటనలను నమ్మిన జిల్లావాసులు పోనీలే అని వైసీపీకి ఒక్క అవకాశం ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం హోదాలో జగన్ జిల్లావాసులకు మరిన్ని హామీలు ఇచ్చేశారు. అవన్నీ నెరవేరుతాయని ఐదేళ్లు ప్రజలు ఎదురుచూశారు. మళ్లీ ఎన్నికల సమయం వచ్చేసింది. కానీ జగన్ ఇచ్చిన హామీలు బారెడు కాగా.. అమలు చేసింది గుప్పెడు కూడా లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా పలాస నియోజకవర్గంలో సీఎం జగన్ రెండుసార్లు పర్యటించి పలు హామీలు గుప్పించగా.. వాటిల్లో సగం కూడా నెరవేర్చలేదనే ఆరోపణలున్నాయి. సీఎం హామీలకు కూడా దిక్కులేదని నియోజకవర్గ ప్రజలు విస్తుపోతున్నారు. హామీల సంగతి అటుంచితే.. సమస్యల పరిష్కారంపై అధికారపార్టీ నేతలు కనీసస్థాయిలో శ్రద్ధ చూపడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి ఎన్నికల్లో వైసీపీకి ఓట్ల రూపంలో బుద్ధి చెప్పేందుకు సన్నద్ధమవుతున్నారు.

పలాసలో సీఎం ఇచ్చిన హామీలు.. వాస్తవ పరిస్థితి

● సోంపేటలోని బీల ప్రాంతంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో జిల్లావాసులు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వేలాది మందిపై కేసులు నమోదయ్యాయి. 2019 సెప్టెంబర్ 6న పలాసలో జగన్మోహన్‌రెడ్డి పర్యటించారు. 'థర్మల్' ఉద్యమకారులపై కేసులు ఎత్తివేస్తామని, బీలప్రాంతానికి సంబంధించి గతంలో విడుదల చేసిన జీవో 329ను రద్దు చేస్తామని జగన్ ప్రకటించారు. కొన్ని కేసులు మాత్రమే విచారణలో కొట్టివేశారు. వేయి మందికిపైగా ఉద్యమకారులపై ఓ కేసు ఇప్పటికీ అలానే ఉంది. ఈ విషయాన్ని జగన్‌కు గుర్తు చేసేందుకు కూడా అధికారపార్టీ నేతల ప్రయత్నించకపోవడం శోచనీయం.

● ఉద్దానంలో కిడ్నీ బాధితులు కోకొల్లలు. ఇక్కడ కిడ్నీ బాధితులకు, సీరం క్రియేటిన్ 5 పాయింట్లు దాటిన వారికి రూ. 5వేలు పింఛన్, కిడ్నీ రోగులతోపాటు సహాయకులకు ఉచిత బస్సు పాస్ ఇస్తామని జగన్ ప్రకటించారు. ప్రతి 500 మంది సీకేడీ రోగులకు ఒక హెల్త్‌వర్కర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కానీ ఉచిత బస్సు పాస్, హెల్త్‌వర్కర్ హామీ ఇంతవరకు నెరవేర్చలేదు. సీరం క్రియేటిన్ 5 పాయింట్లు దాటినవారిలో కొంతమందికే పింఛన్ అమలవుతోంది.

● జిల్లాలో 2018లో తితలీ తుపాను ప్రళయం సృష్టించింది. ఈ తుఫాన్ ధాటికి ఉద్దానం ప్రాంతమంతా అతలాకుతలమైంది. కొబ్బరి, జీడిపంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తుఫాన్ సమయంలో విజయనగరం జిల్లాలో పాదయాత్ర చేస్తున్న జగన్మోహన్‌రెడ్డి.. బాధితులను పరామర్శించేందుకు కూడా రాలేదు. అయినప్పటికీ వైసీపీని ప్రజలు ఆదరించారు. పలాస వచ్చిన సీఎం... తితలీ తుఫాన్ సమయంలో తీవ్రంగా నష్టపోయిన కొబ్బరి రైతులకు రెట్టింపు పరిహారం ఇస్తామని ప్రకటించారు. సుమారు 7వేల మంది రైతులకు పరిహారం అందక.. ఇప్పటికీ నిరీక్షణ తప్పడంలేదు.


వృథాగా పోతున్న వంశధార నది నీరు

● వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు-మంచినీళ్లపేట వద్ద జెట్టీ ఏర్పాటు చేస్తామని సీఎం జగన్ ప్రకటించారు. ఫిష్ లాండింగ్ సెంటర్ ఏర్పాటుకు రూ. 11.95 కోట్లు మంజూరైనా ఇప్పటికీ పనులు పూర్తిచేయలేదు. ఆ ప్రాంతంలో ఇసుక దిబ్బలను చదునుచేసి ఆపై సిమెంట్ పలకలు వేసి వదిలేశారు. మళ్లీ కంకర వేసి భూ మట్టం ఎత్తు చేసి పనులు చేపడుతున్నా.. ఆశించిన స్థాయిలో ప్రగతి లేదు.

కేసు నడుస్తూనే ఉంది..



2010 జులై 14న సోంపేట థర్మల్ పవర్ ప్లాంట్‌కు సంబంధించి జరిగిన కాల్పుల్లో ఈ ప్రాంతానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. వేలాది మందిపై పోలీసులు కేసులు పెట్టారు. నాపై పవర్‌ప్లాంట్ ఉద్యమా నికి సంబంధించి 57 కేసులు నమోదు చేశారు. ఇందులో ఒక కేసు ఇప్పటికీ నడుస్తూనే ఉంది. బారువ పోలీసులు 723మంది ఉద్యమకారులపై కేసు పెట్టారు. మా ఇంట్లో ఐదు మందిపై కేసులు నమోదు చేశారు. కాల్పుల అనంతరం ఈ ప్రాంతానికి పరామర్శకు వచ్చిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. మా ఇంటికొచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే కేసులన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ కేసులు రద్దు చేయలేదు.

-బీన ఢిల్లీరావు, పర్యావరణ పరిరక్షణ సంఘ ప్రధాన కార్యదర్శి

అదనపు పరిహారం అంతే..



తితలీ తుపాను సమయంలో కొబ్బరితోట ధ్వంసమైంది. కేవలం రూ.40వేలు మాత్రమే పరిహారం అందింది. రెట్టింపు పరిహారం ఇప్పటికీ ఇవ్వలేదు.

-పి.సత్యనారాయణ, ప్రగడపుట్టుగ

మాటిచ్చారు.. కానీ..



తితలీ తుఫాన్‌లో దెబ్బతిన్న పంటలకు అదనపు పరిహారం ఇస్తామని మాట ఇచ్చారు. కానీ నేటికీ అమలు చేయలేదు. కొబ్బరి చెట్లు నాశనమై పంటలేక ఇబ్బంది పడుతున్నాం. రెట్టింపు పరిహారం మాటే.. మరిచి పోయినట్లున్నారు.

-బి.చక్రధరరావు, కవిటి

పింఛన్ అందలేదు..



ఉద్దానంలో కిడ్నీ రోగులకు, రక్తపరీక్షలో సీరం క్రియేటిన్ స్థాయి అధికంగా ఉన్నవారి పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. నాకు సీరం క్రియేటిన్ స్థాయి అధికంగా ఉన్నా.. ఇంతవరకూ పింఛన్ మంజూరు చేయలేదు. వైద్యఖర్చులకు ఇబ్బంది పడుతున్నాం.

- కిరోమని బిసాయి, బల్లిపుట్టుగ, కవిటి మండలం

రోగులకు డయాలసిస్‌తో సరి

● పెద్దాసుపత్రిగా.. కిడ్నీ పరిశోధన కేంద్రం


పలాస-కాశీబుగ్గలోని కిడ్నీ పరిశోధన కేంద్రం-200 పడకల ఆసుపత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న సీఎం జగన్ (ఫైల్)


కనీస పరికరాలు లేని కిడ్నీ పరిశోధన విభాగం

పలాస: ఎంతో అట్టహాసంగా గత ఏడాది డిసెంబరు 13 సీఎం జగన్ పలాసలో కిడ్నీ పరిశోధన కేంద్రం-200 పడకల ఆసుపత్రిని ప్రారంభించారు. కిడ్నీ రోగులకు పెద్ద ఉపకారం చేశామని బిల్డప్ ఇచ్చారు. వాస్తవానికి సీహెచ్‌సీ కన్నా పెద్దాసుపత్రిగా ప్రస్తుతం అక్కడ రోగులకు సేవలు అందిస్తున్నారంటే నమ్మశక్యం కాదు. పలాస, హరిపురం సీహెచ్‌సీల్లో ఉన్న డయాలసిస్ కేంద్రాలు పూర్తిగా బంద్ చేసి సంబంధిత పరికరాలు కిడ్నీ పరిశోధన కేంద్రానికి తీసుకెళ్లి సీఎంతో ప్రారంభించేశారు. అదనంగా ఒక సిటీ స్కాన్ మాత్రం కొత్తగా తీసుకువచ్చారు. ప్రస్తుతం ఇక్కడి ఆసుపత్రిలో జనరల్ వైద్యానికి సంబంధించిన వైద్యాధికారులు తప్ప.. కిడ్నీ వ్యాధులకు ప్రత్యేక వైద్యులు ఎవరూ అందుబాటులో లేరు. కేవలం సిబ్బంది. ప్రైవేటు స్వచ్ఛంద సంస్థ సహకారంతోనే నిర్వహిస్తున్నారు. సీఎం జగన్.. ఆసుపత్రి ప్రారంభించిన సమయంలో ఫిబ్రవరి-2024 నాటికి కిడ్నీ మార్పిడికి సంబంధించిన చికిత్స కూడా జరగాలని రాష్ట్ర వైద్యాధికారులకు సూచించిన విషయం తెలిసిందే. కాగా.. డయాలసిస్ కేంద్రంలో క్రమేపీ బెడ్ల పెంపు, పరిశోధన, 200 పడకల ఆసుపత్రిగా రూపొందిస్తామని సాక్ష్యాత్తు వైద్యాధికారులే స్పష్టం చేస్తుండడం విశేషం.

అతీగతి లేని ఆఫ్‌షోర్ రిజర్వాయర్

పలాస మండలం రేగులపాడు గ్రామం వద్ద 25వేల ఎకరాలకు నిర్దేశించిన ఆఫ్‌షోర్ జలాశయాన్ని.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైఎస్.రాజశేఖరరెడ్డి 2008లో శంకుస్థాపన చేశారు. రూ.123కోట్ల వ్యయంతో దీన్ని నిర్మించాల్సి ఉంది. పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం, టెక్కలి, మెళియాపుట్టి మండలాలకు చెందిన రైతులకు ఇది నిర్దేశించింది. నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో పనులు ఆగిపోయాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దీనికి రూ.550కోట్లు నిధులు మంజూరు చేస్తు పరిపాలన ఆమోదాన్ని తెలిపారు. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దీన్ని తామే నిర్మిస్తామని చెప్పి సాక్ష్యాత్తు సీఎం జగన్ రూ.850 కోట్ల నిధులకు ఆమోదాన్ని తెలిపారు. ఐదేళ్లలో రూ.కోటి విలువైన పనులు కూడా జరగకపోవడంతో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణంపై నీలినీడలు అలముకున్నాయి. దీంతోపాటు నిర్వాసితులకు ఇచ్చిన కాలనీలో కూడా మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటు గడపాల్సి వస్తోంది. ఆఫ్‌షోర్‌కు ఉదారంగా భూములిస్తే తమకు ఇచ్చిన గౌరవం ఇదేనా? అని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు.


నిలిచిన ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులు



ఆదిత్యాలయంలో కొట్నం దంపు

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం సుగంధ ద్రవ్య మర్దన(కొట్నం దంపు) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు పూజలు చేశారు. శుక్రవారం స్వామికి తిరువీధి, రాత్రి 9గంటలకు కల్యాణ మహోత్సవం, అగ్ని ప్రతిష్ఠాపనం, ప్రవేశ హోమాదులు నిర్వహించనున్నట్లు ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

- అరసవల్లి

ఈదురుగాలుల బీభత్సం

● కూలిన విద్యుత్ స్తంభాలు

పొందూరు, ఏప్రిల్ 18: పొందూరు మండలం తోలాపి, పిల్లలవలస, ధర్మపురం, కింతలి, కనిమెట్ట తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కింతలి జడ్పీ ఉన్నత పాఠశాల పక్కన భారీ చెట్టుకొమ్మ విరిగిపడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదమే తప్పింది. పిల్లలవలస, తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో బుధవారం రాత్రి 7 నుంచి గురువారం ఉదయం వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొద్దిపాటి చినుకులు పడడంతో ఉక్కపోతతో ప్రజలు మరింత ఇబ్బందులు పడ్డారు.


పిల్లలవలసలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం


కింతలి పాఠశాల పక్కన విరిగిన చెట్టుకొమ్మ

తొలిరోజు.. ఆరు నామినేషన్లు

● మొత్తం ఇండిపెండెంట్ అభ్యర్థులే

శ్రీకాకుళం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం ఆరంభమైంది. గురువారం నుంచి నామినేషన్లను స్వీకరణ ప్రారంభమైంది. తొలిరోజున ప్రధాన రాజకీయ పార్టీల నామినేషన్లను దాఖలు కాలేదు. కేవలం ఇండిపెండెంట్ అభ్యర్థులు మాత్రమే నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు నామినేషన్లు వేశారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో అప్పుడే నామినేషన్ ఘట్టంలో ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక్కడి ఎన్డీఏ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్).. బీజేపీ తరఫున ఎన్నికల బరిలో నిల్చున్నారు. అయితే ఈ నియోజకవర్గం నుంచి గురువారం ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. ఒకరు రణస్థలం మండలం పాతర్లపల్లి గ్రామానికి చెందిన నేతల ఈశ్వరరావు. మరొకరు లావేరు మండలం ఎస్.ఎన్.పురం గ్రామానికి చెందిన నడుపూరు ఈశ్వరరావు. వీరిద్దరి పేర్లు కూడా.. ఇంచుమించు కూటమి అభ్యర్థి పేరు మాదిరే ఉండడం గమనార్హం. అసలు అభ్యర్థి ఎవరన్నదీ ఓటర్లలో సందేహం కలిగించేలా వీరిద్దరి నామినేషన్ల దాఖలవ్వడం విశేషం. అలాగే ఆమదాలవలస నియోజకవర్గంలో ఇద్దరు అభ్యర్థులు, టెక్కలి, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఒక్కో అభ్యర్థి చొప్పున ఇండి పెండెంట్‌గా నామినేషన్లు వేశారు. శుక్రవారం ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు.

దువ్వాడకు ఇంటిపోరు

- నామినేషన్ వేస్తానంటున్న శ్రీనివాస్ సతీమణి
- టెక్కలి వైసీపీలో హీటెక్కిన రాజకీయం
- ఏడాది క్రితం శ్రీనునే అభ్యర్థి అని చెప్పిన జగన్
- ఆ తర్వాత మారిన సీన్.. వాణికి ఇన్‌చార్జి పదవి
- ఆమెను తొలగించి దువ్వాడ శ్రీనుకే బాధ్యతలు
- ఈ నిర్ణయంపై దువ్వాడ వాణి తీవ్ర అసంతృప్తి


ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను


జడ్పీటీసీ దువ్వాడ వాణి

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

జిల్లాలో కీలక నియోజకవర్గమైన టెక్కలిలో వైసీపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌కు ఇంటిపోరు మొదలైంది. తాను ఈనెల 22న నామినేషన్ వేస్తానని ఆయన సతీమణి, టెక్కలి జడ్పీటీసీ వాణి శుక్రవారం ప్రకటించడంతో అధికారపార్టీలో కలకలం మొదలైంది. గతేడాది ఏప్రిల్ 19న మూలపేట పోర్టు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి.. సభలో ప్రసంగం అనంతరం నియోజకవర్గ అభ్యర్థిగా దువ్వాడ శ్రీను పేరును ప్రకటించారు. ప్రజలందరూ ఆశీర్వదించాలంటూ కోరారు. కొద్దిరోజుల తర్వాత దువ్వాడ శ్రీను సతీమణి వాణి నేరుగా సీఎం వద్దకు వెళ్లి.. తన దగ్గరున్న ఆధారాలు.. ఇతరత్రా కీలక విషయాలను వెల్లడించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో టెక్కలి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా దువ్వాడ వాణిని జగన్ నియమించారు. ఆతర్వాత కొన్నాళ్లకు మళ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిని మార్పుచేసి దువ్వాడ శ్రీనును టెక్కలి వైసీపీ అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించేశారు. ఈ నిర్ణయంపై అప్పట్లో వాణి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

పోటీ చేస్తానని ప్రకటన

సార్వత్రిక ఎన్నికలకు తాను కూడా టెక్కలి నుంచి పోటీలో దిగుతున్నట్లు.. ఈనెల 22న నామినేషన్ వేస్తున్నట్లు దువ్వాడ వాణి గురువారం ప్రకటించారు. దీంతో ఈ విషయం సంచలనమైంది. ఇంటిపోరుతోనే.. పోటీకి సై అన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్న తన సతీమణి వాణిని ఎలా ఎదుర్కొంటారోనని చర్చ మొదలైంది. ఒకవేళ పోటీలో ఉంటే తన పరువు.. పార్టీ పరువేమవ్వాలన్నది సంశయమే.

టీడీపీలోకి భారీగా చేరికలు

ఇప్పటికే నియోజకవర్గంలో అత్యంత బలంగా టీడీపీలోకి చేరికలు పెరిగిపోయాయి. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఇంటికి వెళ్లిమరీ వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. దీంతో అక్కడ వైసీపీ ఏరీతిన ఉందన్నదీ ప్రజలందరికీ అర్థమవుతోంది.

ఎండలు.. బాబోయ్ ఎండలు


ఎల్.ఎన్.పేట : నిర్మానుష్యంగా మారిన అలికాం-బత్తిలి ప్రధానరోడ్డు

● ఎల్.ఎన్.పేటలో రికార్డుస్థాయిలో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత

● 14 మండలాల్లో తీవ్ర వడగాల్పులు

అరసవల్లి/ ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 18: ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఎండలు ఠారెత్తిస్తున్నాయి. రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఓవైపు ఎండ తీవ్రత, మరోవైపు వడగాల్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గురువారం ఎల్.ఎన్.పేట మండలంలో అత్యధికంగా 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో అలికాం-బత్తిలి రహదారి నిర్మానుష్యంగా కనిపించింది. హిరమండలంలో 42.7 డిగ్రీలు, ఆమదాలవలసలో 42.1, బూర్జలో 41.8 డిగ్రీలు.. ఇలా జిల్లాలోని అన్నిమండలాల్లో 40డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 14 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచాయి. దీంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు హడలిపోతున్నారు. అత్యవసరమైతేనే జాగ్రత్తలు తీసుకుంటూ బయటకు వస్తున్నారు. ఈక్రమంలో మధ్యాహ్నం వేళ రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో ఎండలు ఇంకెంత తీవ్రంగా ఉంటాయో అని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.


ఎండకు రక్షణ ఇలా..



ఎచ్చెర్ల నియోజకవర్గం టీడీపీ కంచుకోటగా ఉంది. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో ఆరుసార్లు టీడీపీ అభ్యర్థులకే ఓటర్లు పట్టంకట్టారు. ఈ నియోజకవర్గంలో అత్యధికంగా తూర్పుకాపులు ఉన్నారు. అభ్యర్థుల గెలుపోటములను ఈ ఓటర్లే శాసించనున్నారు. ఈసారి ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీల నుంచి అభ్యర్థులు తలపడుతున్నారు. వీరంతా రణస్థలం మండలానికి చెందినవారే.
(రణస్థలం)

రణభూమిలో రాజు ఎవరో?

● ఆరుసార్లు టీడీపీదే విజయం ● కాంగ్రెసేతర పార్టీలకే పట్టంకడుతున్న ఓటర్లు ● ఈసారి కూటమి, వైసీపీల మధ్యే ప్రధాన పోటీ
● 2,43,056 మంది ఓటర్లు ● తూర్పుకాపులే అధికం ● ఇదీ ఎచ్చెర్ల నియోజకవర్గ ముఖచిత్రం



జాతీయ రహదారి పొడవునా విస్తరించిన ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం జిల్లాకే ముఖద్వారంగా స్వాగతం పలుకుతోంది. 1967లో ఈ నియోజకవర్గం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటి వరకు 12 సార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 1978 నుంచి 2004 వరకు ఎచ్చెర్ల సెగ్మెంట్ ఎస్సీలకు రిజర్వ్ కాబడింది. 2009లో జరిగిన నియోజకవర్గ పునర్విభజనలో ఎచ్చెర్ల జనరల్ కేటగిరీకి కేటాయించి.. అప్పటి వరకు చీపురుపల్లిలో ఉన్న జి.సిగడాం మండలాన్ని ఎచ్చెర్లలో విలీనం చేశారు. 1983లో టీడీపీ ఆవిర్భావంతో ఆ పార్టీకి ఎచ్చెర్ల కంచుకోటగా మారింది. ఇప్పటి వరకు టీడీపీ ఆరుసార్లు విజయం సాధించగా, కాంగ్రెస్ అభ్యర్థులు మూడుసార్లు, వైసీపీ, ఇండిపెండెంట్, జనతా అభ్యర్థులు చెరొకసారి గెలిచారు. ఈసారి పోటీ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు (బీజేపీ), వైసీపీ అభ్యర్థి, సిట్టింగ్ శాసనసభ్యుడు గొర్లె కిరణ్‌కుమార్‌ల మధ్యే ప్రధానం నెలకొంది.

కూటమిలో బీజేపీకి దక్కిన సీటు..

టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుల్లో భాగంగా కూటమి తరఫున బీజేపీ ఎచ్చెర్ల అసెంబ్లీ సీటును దక్కించుకుంది. ఈ సెగ్మెంట్‌లో టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నేత కిమిడి కళావెంకటరావు చీపురుపల్లి నుంచి పోటీచేస్తున్నారు. కాగా, ఇదే నియోజకవర్గం నుంచి టీడీపీ టికెట్ ఆశించిన కలిశెట్టి అప్పలనాయుడు విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తుండడం కలిసొచ్చే అంశంగా పేర్కొనవచ్చు.

ఓటర్ల వివరాలు..

ఎచ్చెర్ల నియోజకవర్గంలో పురుషులు 1,22,223 మంది, మహిళలు 1,20,819 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 14 మంది ఉన్నారు. నియోజకవర్గంలో తూర్పు కాపు ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో కాపు సామాజిక వర్గం ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారు. ఎచ్చెర్ల మండలంలో కాళింగ, వెలమ సామాజిక వర్గాలు ఉన్నాయి. ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో సుమారు 15 వేల మంది మత్స్యకార ఓటర్లు ఉన్నారు. లావేరు, జి.సిగడాం మండలాల్లో తెలగ సామాజిక వర్గం ప్రజలు ఉన్నారు.

నియోజకవర్గ చరిత్ర..

ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం 1967లో ఏర్పాటైంది. 1967, 1972లో ఓపెన్ కేటగిరీలో ఎన్నికలు జరిగాయి. 1978 నుంచి 2004 వరకు ఎస్సీలకు రిజర్వ్ చేయబడింది. ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం మండలాలతో ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం 2004 ఎన్నికల వరకు ఉండేది. 2009లో జరిగిన నియోజకవర్గ పునర్విభజనలో జి.సిగడాం మండలాన్ని ఎచ్చెర్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో కొత్తగా కలిపారు. 2009 ఎన్నికల నుంచి ఓపెన్ కేటగిరీకి ఈ నియోజకవర్గాన్ని కేటాయించారు.

ప్రతిభాభారతి ఐదుసార్లు విజయం..

ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1983 నుంచి 1999 వరకు వరుసగా ఐదుసార్లు కావలి ప్రతిభాభారతి శాసనసభ్యురాలిగా ఎన్నికయ్యారు. మంత్రిగా, అసెంబ్లీ స్పీకర్‌గా ఆమె పనిచేశారు. నియోజకవర్గ పునర్విభజనలో ఎచ్చెర్ల జనరల్ కేటగిరీకి కేటాయించడంతో ఆమె రాజాం (ఎస్సీ) నియోజక వర్గం నుంచి 2009, 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చవిచూశారు. 2004 ఎన్నికల్లో ఎచ్చెర్ల నుంచి ప్రతిభాభారతి (టీడీపీ)పై విజయం సాధించిన కోండ్రు మురళీమోహన్ (కాంగ్రెస్), 2009లో రాజాం (ఎస్సీ) నియోజకవర్గంలో ఆమె పైనే పోటీ చేసి గెలుపొందారు. 1978లో ఎన్నికల్లో ప్రతిభాభారతి పెదనాన్న కొత్తపల్లి నరసయ్య జనతా పార్టీ తరఫున ఎచ్చెర్ల నుంచి పోటీచేసి శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు.

ఈసారి అభ్యర్థులంతా రణస్థలం వారే..

ఈ ఎన్నికల్లో చిత్ర విచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. అధికార వైసీపీ ఒంటరిగా పోటీచేస్తుండగా.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కట్టాయి. మరో వైపు కాంగ్రెస్ పార్టీ సైతం క్రియాశీలకంగా మారింది. వామపక్షాలతో కలిసి ఇండియా కూటమి తరఫున పోటీచేస్తోంది. ఇప్పటికే జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల ప్రకటన పూర్తయ్యింది. అయితే ఎచ్చెర్ల నియోజకవర్గం మాత్రం ఎన్నో ప్రత్యేకతలకు వేదికగా మారుతోంది. ఎచ్చెర్ల నియోజకవర్గం శ్రీకాకుళం జిల్లాలో ఉంది. కానీ విజయనగరం లోక్‌సభ స్థానం పరిధిలో కొనసాగుతోంది. పొత్తులో భాగంగా ఈ అసెంబ్లీ స్థానం బీజేపీకి కేటాయించగా.. ఆ పార్టీ నడుకుదిటి ఈశ్వరరావును ఖరారు చేసింది. ఆయన సొంత గ్రామం రణస్థలం మండలం బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలేం. అటు విజయనగరం పార్లమెంట్ స్థానానికి సంబంధించి టీడీపీ అభ్యర్థిగా కలిశెట్టి అప్పలనాయుడు ఖరారయ్యారు. ఈయన స్వగ్రామం రణస్థలం మండలంలోని పీఎస్‌పురం. వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పోటీచేస్తున్నారు. ఈయన స్వగ్రామం రణస్థలం మండలంలోని పాతర్లపల్లి. కాంగ్రెస్ అభ్యర్థిగా కరిమజ్జి మల్లేశ్వరరావు పేరును ఖరారు చేసింది. ఈయన స్వగ్రామం రణస్థలం మండలంలోని నగరప్పాలేం. దీంతో అన్ని పార్టీలు రణస్థలం మండలానికి ప్రాధాన్యం ఇచ్చాయి. పేరుకే ఎచ్చెర్ల నియోజకవర్గం కానీ.. రాజకీయ కార్యకలాపాలు నడిచేది రణస్థలం నుంచే. ఎన్నెన్నో యుద్ధగాధలతో ప్రాచుర్యంలోకి వచ్చిన రణస్థలం నిజంగానే రాజకీయాలకు 'రణ'స్థలిగా మారడం విశేషం. ఏడాది కిందట జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ యువగళం పేరిట రణస్థలం నుంచే వైసీపీ ప్రభుత్వంపై పోరాటం ప్రారంభించిన సంగతి తెలిసిందే. అప్పట్లో రాష్ట్రం చూపు రణస్థలంపై పడింది. ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీలు రణస్థలానికి ప్రాధాన్యమివ్వడంతో మరోసారి రణస్థలం పేరు మార్మోగిపోతోంది.



కలిశెట్టి అప్పలనాయుడు (ఎంపీ, అభ్యర్థి) విజయనగరం

కరిమజ్జి మల్లేశ్వరరావు (కాంగ్రెస్)

గొర్లె కిరణ్‌కుమార్ (వైసీపీ)

ఎన్ఈఆర్ (కూటమి)

రాష్ట్రంలో ఎచ్చెర్లకు ప్రత్యేక గుర్తింపు..

ఎచ్చెర్ల నియోజకవర్గానికి రాష్ట్ర స్థాయి గుర్తింపు ఉంది. ఇక్కడి శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహించిన నేతలు మంత్రి పదవులతో పాటు పార్టీలో కీలక పదవులు చేపట్టడంతో ఎచ్చెర్లకు మంచి గుర్తింపు లభించింది. నాటి రణభూమిగా పేరొందిన రణస్థలం ఇదే నియోజకవర్గంలోనే ఉంది. బొబ్బిలి రాజులు, విజయనగరం రాజుల యుద్ధానికి ప్రధాన కేంద్రంగా అప్పట్లో రణస్థలం వర్ధిల్లిందని చరిత్ర చెబుతోంది. ఎస్ఎంపురం (ఎచ్చెర్ల మండలం) మహమ్మదీయుల కాలంలో ప్రధాన కేంద్రంగా ఉండేది. పారిశ్రామిక వాడ, విద్యాకేంద్రంగా భాసిల్లుతోంది. జిల్లా కేంద్రంలోకి అడుగుపెట్టగానే స్వాగతించే ఎచ్చెర్ల నియోజకవర్గానికి ఇంకెన్నో ప్రత్యేకతలు ఉన్నాయి.

సంవత్సరం	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	ఆధిక్యం
1967	నడిమింటి అప్పలనర్సునాయుడు	కాంగ్రెస్	బల్లాడ హరప్పడురెడ్డి	ఇండిపెండెంట్	2,898
1972	బల్లాడ హరప్పడు రెడ్డి	ఇండిపెండెంట్	నడిమింటి అప్పలనర్సునాయుడు	కాంగ్రెస్	20,636
1978	కొత్తపల్లి నరసయ్య	జనతా	బొడ్డేపల్లి నర్సింహులు	కాంగ్రెస్	9,791
1983	కావలి ప్రతిభా భారతి	టీడీపీ	యామాల సూర్యనారాయణ	కాంగ్రెస్	25,062
1985	కావలి ప్రతిభాభారతి	టీడీపీ	చప్పిడి విజయలక్ష్మి	కాంగ్రెస్	26,947
1989	కావలి ప్రతిభాభారతి	టీడీపీ	బొడ్డేపల్లి నర్సింహులు	కాంగ్రెస్	18,581
1994	కావలి ప్రతిభాభారతి	టీడీపీ	జంపు లచ్చయ్య	కాంగ్రెస్	30,805
1999	కావలి ప్రతిభాభారతి	టీడీపీ	కోండ్రు మురళీమోహన్	కాంగ్రెస్	10,790
2004	కోండ్రు మురళీమోహన్	కాంగ్రెస్	కావలి ప్రతిభాభారతి	టీడీపీ	5,701
2009	మీసాల నీలకంఠం	కాంగ్రెస్	నాయన సూర్యనారాయణరెడ్డి	టీడీపీ	15,015
2014	కిమిడి కళావెంకటరావు	టీడీపీ	గొర్లె కిరణ్‌కుమార్	వైసీపీ	4,741
2019	గొర్లె కిరణ్‌కుమార్	వైసీపీ	కిమిడి కళావెంకటరావు	టీడీపీ	18,675



ఎచ్చెర్ల నేతలు పక్క జిల్లాకు..

ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన నేతలు పొత్తుల నేపథ్యంలో పక్క జిల్లాలో పోటీకి దిగుతున్నారు. రణస్థలం మండలానికి చెందిన టీడీపీ నాయకుడు, పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు విజయనగరం పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఈయన ఎచ్చెర్ల నియోజకవర్గ అసెంబ్లీ సీటును ఆశించారు. అయితే, పొత్తుల కారణంగా బీజేపీకి ఎచ్చెర్ల సీటును కేటాయించారు. ఇక్కడ నుంచి విజయనగరం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు బీజేపీ నుంచి బరిలో ఉన్నారు. దీంతో విజయనగరం పార్లమెంట్ అభ్యర్థిగా కలిశెట్టిని అధిష్ఠానం ఖరారు చేసింది. అలాగే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు కూడా ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచే పోటీ చేసేందుకు ఆసక్తి చూపారు. అయితే, ఆయన బలమైన నేత కావడంతో చీపురుపల్లిలో మంత్రి బొత్సపై పోటీకి నిలబెట్టాలని అధిష్ఠానం భావించింది. ఈ మేరకు పలు దఫాలు సర్వేలు నిర్వహించింది. సర్వేలు అనుకూలంగా రావడంతో కళా వెంకటరావుకు చీపురుపల్లి సీటును కేటాయించింది. ఎచ్చెర్లకు చెందిన కలిశెట్టి అప్పలనాయుడు, కిమిడి కళావెంకటరావు పక్క జిల్లాలో పోటీకి దిగుతుండడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

నామినేషన్ల సందడి



● టెక్కలిలో స్వతంత్ర అభ్యర్థి దాఖలు

టెక్కలి: టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గురువారం స్వతంత్ర అభ్యర్థిగా నందిగాం మండలం పెద్దలవునిపల్లి గ్రామానికి చెందిన అట్టాడ రాజేష్ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ మేరకు ఆర్వో నూరుల్‌కమర్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. రాజేష్ ఇప్పటివరకు బీజేపీలో ఉండగా, ఇప్పుడు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ● ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్లు టెక్కలి నియోజకవర్గ ఎన్నికల అధికారి నూరుల్ కమర్ తెలిపారు. గురువారం టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా బందోబస్తు విషయంపై డీఎస్పీ, సీఐలతో మాట్లాడారు. జిల్లా కేంద్రం నుంచి పంపించిన ఈవీఎంలు, వీవీప్యాట్లను స్ట్రాంగ్ రూంలో ఉంచారు.

ఇచ్ఛాపురంలో..

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సంబంధించి తొలిరోజు కవిటి మండలం రాజపురానికి చెందిన జన్నెల సూర్య వరప్రసాద్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర తెలిపారు. నామినేషన్ సమయంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఆమదాలవలసలో రెండు..

ఆమదాలవలస: నియోజకవర్గంలో గురువారం ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేశారు. పొందూరు మండలం లోలుగు గ్రామానికి చెందిన లోలుగు వెంకట రాజశేఖర్, ఆమదాలవలస మునిసిపాలిటీ మెట్టక్కివలసకు చెందిన గణపతి జగదీశ్వరరావు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్‌కు అందించారు. డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.వేణుగోపాల్, ఎన్నికల డీటీ మురళీధర్‌నాయక్ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల నుంచి ఇద్దరు..

రణస్థలం: రణస్థలంలో ఎచ్చెర్ల నియోజవర్గం నుంచి అసెంబ్లీకి పోటీ చేసేందుకు స్వతంత్ర అభ్యర్థులుగా తొలిరోజు ఇద్దరు నామినేషన్ వేసినట్లు ఆర్వో ఎస్‌వీ లక్ష్మణమూర్తి తెలిపారు. పాతర్లపల్లి గ్రామానికి చెందిన నేతల ఈశ్వరరావు, లావేరు మండలంలోని తామాడ గ్రామానికి చెందిన నడుపూరి ఈశ్వరరావు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేశారు.

పలాసలో నిల్..

పలాస/పలాస రూరల్: పలాస నియోజకవర్గం పరిధిలో గురువారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. నామినేషన్లు స్వీకరించే తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి, ఆర్డీవో భరత్‌నాయక్, కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డితో పాటు అధికారుల బృందం ఉదయం 11 గంటల నుంచి నిబంధనల ప్రకారం అభ్యర్థుల కోసం వేచి ఉన్నారు. సమయం పూర్తయ్యే నాటికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. అభ్యర్థులు నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని భరత్‌నాయక్ హెచ్చరించారు. సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు ఇప్పటివరకూ 220 ఫిర్యాదులు అందాయని చెప్పారు. నియోజకవర్గంలో 57 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా గుర్తించి బందోబస్తుకు ఆదేశించామని చెప్పారు.

నేడు గౌతు శిరీష నామినేషన్

పలాస: పలాస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా గౌతు శిరీష శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. నిరాడంబరంగా ఎన్నికల నిబంధన అనుసరించి ఆమె నామినేషన్ వేస్తారని టీడీపీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. వడగాల్పుల నేపథ్యంలో కొద్దిమంది నాయకులు, అభిమానులతో ర్యాలీగా వెళ్లి నామినేషను దాఖలు చేయనున్నారు.

మామిడి గోవిందరావు కూడా..

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు పైల బాబ్జీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్రఅధ్యక్షుడు కింజ రాపు అచ్చెంనాయుడు, పార్టీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహననాయుడు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

రేపు బగ్గు రమణమూర్తి...

నరసన్నపేట: నరసన్నపేట నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా టీడీపీ నాయకుడు బగ్గు రమణమూర్తి శనివారం నామినేషన్ వేయనున్నట్లు టీడీపీ కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉదయం 8 గంటలకు రమణమూర్తి తన స్వగ్రామం పోలాకి మండలం మబుగాంలో బయలుదేరిగా ర్యాలీగా నరసన్న పేటకు బయలుదేరుతారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి మధ్యాహ్నం 12 గంటలకు నామినేషన్ వేయనున్నారు.

23న రవికుమార్..

ఆమదాలవలస: ఆమదాలవలస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కూన రవికుమార్ ఈ నెల 23న నామినేషన్ వేయనున్నారు. ఈ మేరకు గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం ఉదయం 10.45 గంటకు ఆమదాలవలస తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నట్టు తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేయనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని రవికుమార్ కోరారు.



టెక్కలిలో ఈవీఎంలు పరిశీలిస్తున్న అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

మహిళా ఓటర్లే నిర్ణేతలు

● అభ్యర్థుల గెలుపోటములు వారిపైనే..
● ఏడు నియోజకవర్గాల్లో కీలకం ● పురుషుల కంటే 17,466 మంది అధికం



కలెక్టరేట్, ఏప్రిల్ 18: జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక లోక్‌సభ సెగ్మెంట్ల పరిధిలో మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. మొత్తం 16,27,024 మంది ఓటర్లు ఉండగా పురుషుల కంటే 17,466 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉండడం విశేషం. జిల్లాలోని మొత్తం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను ఎచ్చెర్ల విజయనగరం లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోకి చేర్చిన విషయం విదితమే. మిగిలిన ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఇందులో అత్యధికంగా శ్రీకాకుళం నియోజకవర్గంలో 1,37,488 మహిళా ఓటర్లు ఉండగా, 1,37,254 మంది మహిళా ఓటర్లతో ఇచ్ఛాపురం నియోజకవర్గం రెండో స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయపార్టీలు ఎన్నికల్లో గెలుపు కోసం మహిళా ఓటర్ల కోసం మేనిఫెస్టోలో ప్రత్యేక పథకాలు మహిళలకు ప్రకటిస్తున్నారు. కొత్త కొత్త పథకాలతో మహిళా ఓటర్లను ఆకర్షించే పనిలో పార్టీలు తలమునకలయ్యాయి. ఏదేమైనా జిల్లాలో రానున్న ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించేది మహిళా ఓటర్లేనని విశ్లేషకులు చెబుతున్నారు.

నియోజకవర్గం	మహిళా ఓటర్లు	పురుష ఓటర్లు
ఇచ్ఛాపురం	1,37,254	1,30,544
పలాస	1,11,709	1,06,877
టెక్కలి	1,18,129	1,17,511
పాతపట్నం	1,12,696	1,12,095
శ్రీకాకుళం	1,37,488	1,34,866
ఆమదాలవలస	97,477	95,987
నరసన్నపేట	1,07,434	1,06,841
మొత్తం ఓటర్లు	8,22,187	8,04,721

మూడు వాహనాలకే అనుమతి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 18: కేవలం అభ్యర్థితో పాటు మరో నలుగురు వ్యక్తులు, మూడు వాహనాలకు మాత్రమే తహసీల్దార్ కార్యాలయం గేటు వరకు అనుమ తించాలని, ఇతరులను లోపలికి అనుమతించవద్దని ఎస్ఈబీ జేడీ, నామినేషన్ల ప్రక్రియ ఇన్‌చార్జి గంగాధరం తెలిపారు. గురువారం ఇచ్ఛాపురం బస్టాండ్ వద్ద కటాఫ్ పాయింట్లను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయం గేటు వద్ద నుంచి నడిచి వెళ్లి నామినేషన్లు వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసీ ఆదేశాల మేరకు కేవలం మూడు కార్లు, ఐదు గురుకు మాత్రమే అనుమతి ఇవ్వాలని, ర్యాలీలు, జనాలను 100 మీటర్లు దూరంలో మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



బస్టాండ్ వద్ద కటాఫ్ పాయింట్ పరిశీలిస్తున్న గంగాధరం



ఏఎస్‌పేటలో టిడ్కో గృహాలు

ఇంటి కల.. కల్ల

- జగనన్నా.. మా గో(గూ)డు పట్టదా? ● టిడ్కో గృహాలను ఇవ్వని వైసీపీ ప్రభుత్వం
- డీడీల డబ్బులు కూడా చెల్లించని వైనం ● లబ్ధిదారుల్లో తీవ్ర ఆందోళన

పేదల సంక్షేమమే ధ్యేయమంటూ గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ సర్కారు వారికి టిడ్కో గృహాలను అందించకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. సొంతింటి కల నెరవేరుతుందనే ఆశతో డీడీలు కట్టిన పేదలు టిడ్కో గృహాల అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఒకపక్క ఇళ్లు అందక.. మరోపక్క కట్టిన డబ్బులు తిరిగి రాక ఆందోళన చెందుతున్నారు. జగనన్నా మా గోడు పట్టదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

(ఇచ్ఛాపురం)

ఇచ్ఛాపురం మునిసిపాలిటీ పరిధిలోని పేదలకు సొంతింటి కల నేర వేరలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ మౌలిక సదుపాయాల సంస్థ (టిడ్కో) పేదలకు ఆవాస సౌకర్యం కల్పించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు రెండుచోట్ల లేఅవుట్ల ఏర్పాటుచేసి ఇళ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంది. లబ్ధిదారుల పేర్లు నమోదుచేసుకుని వారి వద్ద నుంచి డీడీలను స్వీకరించింది. టీడీపీ హయాంలో ఇళ్ల నిర్మాణాలు కొంతమేర జరిగాయి. ఇంతలో 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఇళ్ల పనులు నిలిచిపోయాయి. దీంతో లబ్ధిదారులు డీడీల రూపంలో చెల్లించిన సొమ్ముల కోసం మునిసిపల్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. లబ్ధిదారులు డీడీలు చెల్లించేందుకు అప్పులు చేయాల్సి వచ్చింది. వీటికి వడ్డీలు పెరిగిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము చెల్లించిన డీడీల డబ్బుల వడ్డీ ప్రభుత్వం ఖాతాకు చేరుతోందని లబ్ధిదారులు చెబుతున్నారు. తమకు ఆవాసాలు లేకపోగా, అప్పులు మిగిలాయని పలువురు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

ఇచ్ఛాపురం మునిసిపాలిటీ పరిధిలో 816 మందికి టిడ్కో గృహాలు మంజూరు కాగా ఇందులో 672 మంది లబ్ధిదారులు డీడీల రూపంలో సొమ్ము చెల్లించారు. 144 మంది రూ.లక్ష చొప్పున, 480 మంది రూ.500 చొప్పున చెల్లించారు. ఇందులో 300 ఎస్ఎఫ్‌టీ గృహాలకు 144మందికి, 430 ఎస్ఎఫ్‌టీ గృహాలు 48 మందికి మంజూరు చేసి మొత్తం 192మంది లబ్ధిదారులకు రిజిస్టర్ డాక్యుమెంట్లు ఇచ్చారు. కానీ, ఇంతవరకూ ఇళ్లను అప్పగించలేదు. మిగతా 480 మంది లబ్ధిదారులకు ఇళ్లు లేదు కదా వారు డీడీల రూపంలో చెల్లిం చిన డబ్బులు కూడా ఇంత వరకు ఇవ్వకపోవడంతో కాళ్లు అరిగేలా మునిసిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం...



అపార్ట్‌మెంట్లు రద్దయిన లబ్ధిదారులకు వారు చెల్లించిన డబ్బులుతి చెల్లించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే కేటగిరిల వారీగా లబ్ధిదారులకు అందజేస్తాం. ప్లాట్లు రద్దయిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను ఇచ్చాం. దరఖాస్తుల సమయంలో ఇబ్బందులు ఎదురైతే వాటిని అధిగమించాం. దరఖాస్తులు చేసుకున్న వారికి అవకాశం కల్పించి ఇళ్ల స్థలాలు మంజూరుచేశాం. అర్హులైన వారందరికీ జగనన్న లేఅవుట్‌ల్లో స్థలంతో పాటు పక్కాఇల్లు నిర్మాణానికి రుణాలు కూడా మంజూరు చేశాం.

-ఎన్.రమేష్, మునిసిపల్ కమిషనర్

పునాదుల్లో నిలిచిన నిర్మాణాలు..

ఏఎస్‌పేట రహదారి పక్కన, ఏఎస్‌పేట కాలనీ పరిధిలో టిడ్కో ఆధ్వర్యంలో రెండు లేఅవుట్లు వేశారు. కాలనీలో టిడ్కో గృహాలు నిర్మాణాలు పునాదులు స్థాయిలోనేనిలిచిపోయాయి. ఏఎస్‌పేట మెయిన్ రోడ్డుకు పక్కన నిర్మించిన 192 గృహాలు నిర్మాణాలు పూర్తి చేసినా రోడ్లు, తాగునీరు, పూర్తిస్థాయిలో విద్యుత్‌సదుపాయం కల్పించకపోవడంతో ఇంతవరకూ లబ్ధిదారులకు అందజేయలేదు.

బైండోవర్ అంటే తెలుసా?




నరసన్నపేట: సాధారణంగా ఎన్నికల సమయంలో ఎక్కువగా బైండోవర్ పదం వినిపిస్తుంది. పాత నేరస్థులు, రౌడీ షీటర్లను బైండోవర్ చేస్తారు. ఒక వ్యక్తి వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించినా, ఆయన చర్యలు అనుమానాస్పదంగా ఉన్నా.. ఆ వ్యక్తిని పోలీసులు తహసీల్దార్, లేదా ఆర్డీవో ఎదుట హాజరుపరుస్తారు. బాండ్ పేపర్‌పై ఆ వ్యక్తితో చట్ట వ్యతిరేక పనులు చర్యలు చేపట్టబోమని లిఖిత పూర్వకంగా హామీ తీసుకొని సొంతపూచి కత్తుపై విడుదల చేస్తారు. బైండోవర్‌ను బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్ అంటారు. బైండోవర్ అయిన వ్యక్తి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే 24 గంటల్లో అరెస్ట్ చేస్తారు. ఐపీసీ 107, 108, 109, 110 సెక్షన్ల కింద బైండోవర్ కేసులను నమోదు చేస్తారు. బైండోవర్ సమయంలో వ్యక్తులు రాసిచ్చిన పత్రాలు ఆర్నెళ్లపాటు పోలీసులు వద్ద ఉంటాయి.

కలెక్టర్‌ను కలిసిన ఎన్నికల వ్యయ పరిశీలకుడు

కలెక్టరేట్: జిల్లా ఎన్నికల అధికారి మన్‌జీర్ జిలానీ సమూన్‌ను పాతపట్నం, టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకుడు నవీన్‌కుమార్ సోనీ గురువారం కలెక్టర్ కార్యాలయంలో గౌరవపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాలకు సంబంధించి చర్చించారు.

సీఎం సార్.. పోర్టు గుర్తుందా?

- 'మూలపేట'కు శంకుస్థాపన చేసి నేటికి ఏడాది ● ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు పనులు
- బాహుబలి గ్రాఫిక్స్ అంటున్న విపక్షాలు ● కొలిక్కిరాని ఉప్పు భూముల వ్యవహారం



నార్త్‌బ్రేక్ పనులు ఇలా..

(టెక్కలి)

మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గతేడాది ఏప్రిల్ 19న శంకుస్థాపన చేశారు. నేటికి (శుక్రవారం) సరిగ్గా ఏడాది పూర్తవుతుంది. కానీ, పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు పరిస్థితి ఉంది. రూ.4361.93 కోట్లతో పోర్టు టెండర్లను విశ్వసముద్ర సంస్థ దక్కించుకుంది. ఫేజ్-1లో పోర్టు కెపాసిటీ 23.5ఎంటీపీఏ, నాలుగు బెర్త్‌లు పూర్తయితే రూ.83.3ఎంటీపీఏలు ఎగుమతులు, దిగుమతులకు అనుకూలమని నిర్ణయించారు. ఈ నాలుగు బెర్త్‌ల్లో రెండు జనరల్, ఒకటి బొగ్గు, ఒకటి మల్టీపర్పజ్‌గా వినియోగించా లని, డిసెంబరు 2025 నాటికి పూర్తిచేయాలని సంకల్పించా రు. పోర్టుకు సంబంధించి 826.51 ఎకరాల భూములకు గాను ఇప్పటికి 522.89 ఎకరాలు మాత్రమే విశ్వసముద్రకు అధికారులు అప్పగించారు. మరో 303.62 ఎకరాలు అప్పగించాల్సి ఉంది. అయితే 293.97 ఎకరాల ఉప్పు భూముల వ్యవహారం ఇంకా కొలిక్కి రాలేదు. ఈ భూములకు ఎకరాకు ఏ మేరకు పరిహారం చెల్లించాలన్నది ఇంకా తేలలేదు. రైలు మార్గానికి సంబంధించి 72.42 ఎకరాల భూములకు గాను సుమారు 140మంది రైతులు ఉండగా ఎకరాకు రూ.26లక్షల చొప్పున ఇస్తామని ప్రభుత్వం వెల్లడించింది. కానీ ఆ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగలేదు. అలాగే 39మందికి సంబంధించిన పీడీఎఫ్‌లు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. రహదారుల భూములకు సంబంధించి పరిహారం చెల్లింపుల విషయంలో పలు గ్రామాల రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. ధర పెంపు కోసం కోర్టును ఆశ్రయించిన బన్నువాడ, కోటూరు రైతులకు ప్రభుత్వ ధర కంటే అదనంగా ఎకరాకు రూ.15లక్షల వరకు లభించింది. ముందుగా పోర్టు కోసం అధికార పార్టీ నాయకుల మాటలు నమ్మి భూములు ఇచ్చిన కొన్ని గ్రామాల రైతులకు మాత్రమే ప్రభుత్వ ధరకు అవార్డుల అందాయి. సుమారు 50 ఎకరాలకు పైగా అవార్డులు సైతం పలు కారణాలతో పెండింగ్‌లో ఉండగా అధికారులు ఆ డబ్బులు ట్రెజరీల్లో జమచేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సౌత్‌బ్రేక్ పనులు ఇంకా పూర్తికావాల్సి ఉంది. సాంకేతిక పరికరాల నిర్మాణం నత్తనడకన సాగుతుంది. పోర్టు పనులు బాహుబలి గ్రాఫిక్స్ అని ప్రతిపక్ష నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే అధికార పార్టీ ప్రజాప్రతినిధులు మాత్రం పోర్టు పూర్తయితే 25వేల ఉద్యోగాలు వస్తాయని నమ్మబలుకు తున్నారు. వైసీపీ మాత్రం ఈ ఎన్నికల్లో పోర్టును ప్రచారానికి వాడుకుంటుంది. మొత్తం మీద మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు మొదటి ఏడాదిలో ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదు.




పోర్టు పనులకు శంకుస్థాపన చేసిన సీఎం జగన్ (ఫైల్)



నత్తనడకన సాగుతున్న పోర్టు నిర్మాణ పనులు

తప్పుడు సమాచారం ఇచ్చారో..

- తిప్పలు తప్పవు
- ఎన్నికల్లో అఫిడవిటే కీలకం
- అన్ని వివరాలు పొందుపర్చాల్సిందే



హిరమండలం: ఎన్నికల్లో అఫిడవిట్ కీలకంగా మారింది. నామినేషన్ పత్రాల తో పాటు ఫారం-26 అఫిడవిట్ దాఖలు చేయాలి. అభ్యర్థులు తమ వివరాలతో పాటు ఆస్తులు,అప్పుల గురించి ప్రమాణపత్రం రూపంలో స్పష్టంచేయాలి. గతంలో ఏమైనా కేసులు ఉన్నా, శిక్షపడినా వాటినీ పొందు పరచాలి. ఇందులో తప్పుడు సమాచారం ఇస్తే అదే ప్రత్యర్థుల కు ఆయుధమై కోర్టు కేసుల వరకు వెళ్లడమే కాకుండా అనర్హతవేటుకు దారితీసే అవకాశముంటుంది.

అన్నీ పూరించాలి

అఫిడవిట్‌లోని ఏ ఒక్క కోలం ఖాళీగా వదలరాదని ఈసీ స్పష్టం చేసింది. అభ్యర్థులకు సంబంధం లేకపోతే ఆ కాలం నిల్ లేదా వర్తించదని రాయాలని తెలియజేసింది. అభ్యర్థి సమర్పించిన అఫిడవిట్‌ను గమనించి ఏదైనా సమాచారం లేకపోతే ఆర్వో నోటీసుఇస్తారు. దీంతో సవరించిన అఫిడవిట్‌ను అభ్యర్థి అందించాలి. అయినా పూర్తి స్థాయి వివరాలతో అఫిడవిట్ లేకపోతే పరిశీలన సమయంలో నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్‌ను ఆర్వోలు నోటీసు బోర్డు, వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు.

నేర సమాచారం తప్పనిసరి

క్రిమినల్ కేసులు నమోదై ఉంటే వాటి వివరాలను అఫిడవిట్‌లో పొందు పరచాలి. ఏదైనా కేసులో న్యాయస్థానాలు గతంలో శిక్ష విధించినా, అప్పీ ల్‌కు వెళ్లినా వాటి సమాచారాన్ని ప్రస్తావించాలి.సామాజిక మాధ్యమాల ఖాతాలను కూడా తెలియజేయాలి. అన్ని వివరాలతో కూడిన అఫిడవి ట్‌కు నోటరీ తప్పనిసరి. సాధారణంగా నామినేషన్ దాఖలు సమయంలో రిటర్నింగ్‌అధికారి ముందు అభ్యర్థి ప్రమాణంచేస్తారు. ఇతరులు ఎవరైనా నామినేషన్ సమర్పిస్తే అభ్యర్థి తాను ఉన్న ప్రాంతంలోని మెజిస్ట్రేట్ ఎదు ట ప్రమాణం చేయాల్సి ఉంటుంది.అంతేకాకుండ అభ్యర్థులపై నమోదైన కేసుల వివరాలను ప్రముఖ దినపత్రికల్లో స్పష్టంగా కనిపించేలా ప్రకట నలు ఇవ్వాలి.

అప్పులు, ఆస్తులు పక్కాగా ప్రస్తావించాలి

స్థిర, చరాస్థుల వివరాలతో పాటు చేతిలో, బ్యాంకు ఖాతాల్లోని నగదు, డిపాజిట్లు, ఇతర సేవింగ్, బీమా పాలసీలు,అప్పులు తదితరాలు పొందు పరచాలి. ఆభరణాలు, వాహనాలు, వ్యవసాయ భూములు, వాణిజ్య సముదా యాలు, నివాస స్థలాల వంటివాటిని అఫిడవిట్‌లో ప్రస్తావించాలి. అవి వారసత్వంగా వచ్చాయా లేదా కొనుగోలు చేశారా అన్నది తెలియజేయాలి. స్థిరాస్తులకు సంబంధించి ప్రస్తుత మార్కెట్ విలువలను పొందుపరచాలి. అభ్యర్థితోపాటు కుటుంబ సభ్యుల పేరిట రుణాలు ఉంటే వాటి వివరాలనూ ప్రస్తావించాలి. కుటుంబ సభ్యుల ఆదాయ మార్గాలు, ప్రభుత్వం లేదా ప్రైవేటు కంపెనీల కాంట్రాక్టులు ఉంటే వాటి వివరాలు తెలియజేయాలి.

వివరాలు తెలుసుకోవడం ఓటర్ల హక్కు

ప్రజాప్రతినిధిగా ఎన్నుకోబోయే అభ్యర్థికి సంబంధించిన అన్ని వివరాలు తెలుసుకోవడం ఓటర్ల హక్కు. అప్పుడే అభ్యర్థులపై ఓ స్పష్టత వస్తుంది. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే అభ్యర్థులు తమ నామినేషన్‌తో పాటు అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల నిబంధనలకు లోబడి ఫారం-26 రూపంలో అభ్యర్థులు అఫిడవిట్ సమర్పించాలి. ఇందులో అభ్యర్థులు ఆస్తులు, అప్పులు, కేసుల సమాచారంతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు తెలియజేయాలి.

సిరా చరిత్ర తెలుసా?

- ఎన్నికల్లో ఇదే ముఖ్యం
- ఎడమచేతి చూపుడు వేలి గోరుపై వేస్తారు
- ఇది ఉంటే ఓటు హక్కును వినియోగించుకున్నట్లే..

(నరసన్నపేట)

ఓటు వేశారా? అంటే నోటితో సమాధానం చెప్పనవసరం లేదు. నేరేడు రంగులో ఉన్న సిరా గుర్తున్న వేలుని చూపిస్తే చాలు. సిరా చుక్కకు, ఓటుకు ఉన్న సంబంధం అటువంటిది. ఈ సిరా వేస్తేనే ఓటు హక్కు వినియోగించుకున్నట్లు గుర్తింపు ఉంటుంది. ఓటు వేసిన పౌరులకు ఆ సిరా ఎక్కడ తయారవుతోందోనన్న సందేహాలు ఉంటాయి.

మైసూర్‌లో పరిశ్రమ..

కర్ణాటకలోని మైసూర్‌లో గల రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యం లోని రంగులు వార్నీష్ పరిశ్రమ ఎన్నికల సమయంలో చేతి వేలికి వినియోగించే సిరాను తయారుచేస్తోంది. దేశంలోని అన్నిరాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు జరిగే అసెంబ్లీ, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికలకు ఇక్కడి నుంచే సిరా సరఫరా అవుతోంది. 1962 సార్వత్రిక ఎన్నికల నుంచి మైసూర్ పెయింట్స్ వార్నీష్ కర్మాగారం ఉత్పత్తిచేస్తున్న చెరిగిపోని సిరానే వినియోగిస్తున్నారు. ఈసారి కూడా అక్కడి నుంచే సిరాను సరఫరా చేయ నున్నారు.

తొలుత లక్క.. ఆ తర్వాత పెయింట్లు

1937లో అప్పటి మైసూర్ మహారాజు నాల్మడి కృష్ణరాజు వడయార్ ఈ సిరా తయారీ కర్మాగారాన్ని స్థాపించారు. అప్పటి దీని పేరు మైసూర్ లాక్ అండ్ పెయింట్స్‌వర్క్స్‌గా ఉండేది. 1989లో దీని పేరును మైసూర్ పెయింట్స్ అండ్ వార్నీస్ సంస్థగా మార్చారు. స్వాతంత్ర్యానికి ముందు వరకు మైసూర్ రాజులు స్వాధీనంలో ఉండేంది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇక్కడ తొలుత సీళ్ల వేసుందుకు కావాల్సిన లక్క తయారీకి ఈ పరిశ్రమను స్థాపించారు. చెట్ల నుంచి వచ్చే జిగురు తీసుకొచ్చి దానికి ఇతర అటవీ ఉత్పత్తులను కలిపి లక్కగా మార్చి రాజముద్రను వేసేందుకు మైసూరు రాజులు ఉపయోగించేవారు. జిగురు సరఫరా తగ్గిపోవడంతో లక్కకు బదులుగా చెట్ల పసరు ఆధారంగా పెయింట్ల తయారీని ప్రారంభించారు. 1962లో ఒక ఓటరు పలుమార్లు ఓటు వేయకుండా నిరోధించేందుకు చెరిగిపోని సిరాను ఉత్పత్తిచేయాలని కేంద్ర నిర్ణయించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో నేషనల్ ఫిజికల్ లాబొరేటరీస్ ఫార్ములాతో సిరా ఉత్పత్తి బాధ్యతను ఈ కర్మాగారానికి అప్పగించారు.





ఈ సిరా ఎందుకు చెరగదంటే ..


మొదట్లో ఓటేసిన వ్యక్తికి ఎడమచేతి చూపుడు వేలిపై సిరా చుక్కను పెట్టేవారు. 2006 ఫిబ్రవరి నుంచి ఓటర్ల ఎడమ చేతి వేలి గోరుపై సిరాను గీతగా పెడుతున్నారు. సిరాలో 7.25 శాతం సిల్వర్ నైట్రేట్ ఉన్నందున వెంటనే చెరిగిపోదు. ఈ సిరా నేరేడు పండు రంగులో ఉంటుంది.

ఖర్చులో నిబంధనలు పాటించాల్సిందే

హిరమండలం: ఎన్నికల్లో అభ్యర్థుల వ్యయం గురించి సగటు ఓటరులో ఆసక్తికరంగా ఉంటుంది. ఎంత ఖర్చుచేయవచ్చు, ఎలా ఖర్చు చేయాలన్న విషయంపై ఎన్నికల కమిషన్ నిబంధనలు మేరకు ఆచరించాలి. తాజాగా ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంకావడంతో జోరుగా ఎన్నికల ఖర్చు గురించి చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఎన్నికల్లో గెలుపునకు డబ్బు కీలకంగా మారింది. ఎన్నికల సంఘం నగదు ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలన్న లక్ష్యంతో వ్యయ పరిమితిపై నిబంధనలు జారీచేసింది.

ఇవీ నిబంధనలు

- అభ్యర్థుల వ్యయంపై నియంత్రణలో భాగంగా నామినేషన్లు వేసే వరకు ఖర్చంతా పార్టీ ఖాతా కిందకు వస్తుంది. నామినేషను వేసిన రోజు నుంచి ఎన్నికల వ్యవ విభాగం ఖర్చంతా అభ్యర్థుల ఖాతా కిందే లెక్కిస్తుంది.
- ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం అసెంబ్లీ స్థానానికి రూ.28 లక్షల వరకు ఖర్చుచేసుకోవచ్చని ప్రకటించింది.ఈ పరిమితి దాటితే అనర్హత వేటుపడే అవకాశం ఉంటుంది.
- ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి విచ్చలవిడిగా మద్యం, డబ్బులు ప్రవహించకుండా అడ్డుకట్ట వేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఆధారాలు లేకుండా నగదు, బంగారం తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి నగదుతోపాటు వాహనాలు సీజ్ చేస్తున్నారు. దీంతోపాటు ఆయా పార్టీల ఖర్చులు కూడా లెక్కిస్తున్నారు.
- నగదు ఇష్టానుసారంగా ఖర్చు చేస్తామంటే కుదరదు. హంగు ఆర్భాటాలు శ్రుతి మించితే అభ్యర్థులు ఎన్నికల్లో పోటీచేసే అవకాశాన్ని కోల్పోవలసి వసుంది.
- ఏరోజుకు ఆ రోజు ఖర్చు లెక్కలను నమోదు చేస్తారు.అభ్యర్థులు కూడా ఖర్చుల వివరాలను నమోదు చేసేందుకు రిజిస్టర్‌ను నిర్వహించాలి.
- అభ్యర్థులు ప్రచారానికి సంబంధించి కరపత్రాలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు, భోజనాలు తదితర అన్ని అంశాలను కూడా ఎన్నికల అధికారులు పరిశీలిస్తారు.



కొట్లాటలో ఇద్దరికి గాయాలు

ఎచ్చెర్ల: ఫరీద్‌పేట గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో గురువారం జరిగిన కొట్లాటలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారని ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఓ ఫంక్షన్ వద్ద ఈ వ్యక్తులు తారసపడడంతో మాటమాట పెరిగి కొట్లాడుకున్నారు. ఈ ఘటనలో కిరణ్ కుమార్, వైకుంఠరావులతో పాటు మరికొందరు గాయపడ్డారు. గాయపడిన వ్యక్తులు శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువురి ఫిర్యాదు మేరకు వేర్వేరుగా కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. గ్రామంలో అల్లర్లు లేకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

బూర్జ: ఉప్పినివలస గ్రామ సమీపంలో ఉన్న కోనేరు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బోరువెల్లి రమణ గురువారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. బుధవారం సాయంత్రం వైకుంఠపురానికి చెందిన తమ్మినేని సింహాచలం తన గ్రామం నుంచి ఉప్పినివలస సైకిల్‌పై వెళుతున్నాడు. అదే సమయంలో కొల్లివలసకి చెందిన బోరువెల్లి రమణ బైక్‌పై వస్తూ వెనుక నుంచి సైకిల్‌ను ఢీకొనడంతో ఇద్దరూ పడిపోయారు. పరిస్థితి విషమించడంతో రమణను విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ మృతి చెందాడని ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు. మృతుడికి భార్య రాము, ఇద్దరు పిల్లలున్నారు.

రానున్నది ఎన్డీయే ప్రభుత్వమే: శంకర్


ప్రచారం నిర్వహిస్తున్న కూటమి అభ్యర్థి గొండు శంకర్

అరసవల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించి, అధికారంలోకి రానున్నది ఎన్డీయే ప్రభుత్వమేనని టీడీపీ-జనసేన-బీజేపీ శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. గురువారం నగరంలోని 28వ డివిజన్‌లో ఇన్‌చార్జి గుత్తు చిన్నారావు ఆధ్వర్యంలో వాంబే కాలనీ, బాదుర్లపేట, కొత్తపేట తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి కోరాడ సర్వేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కార్య దర్శి శవ్వాన ఉమామహేశ్వరి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పిఎంజె.బాబు, కోరాడ హరగోపాల్, గంగు పెద్ద రమణ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన కైజోల, నర్సిపురం గ్రామస్థులు

పలాస: పలాస మండలం కైజోల, మునిసిపాలిటీ పరిధి నర్సిపురం గ్రామాల నుంచి పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలాస అభ్యర్థి గౌతు శిరీష కండువాలు వేసి ఆహ్వానించారు. ● మత్స్యకారులకు వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని గౌతు శిరీష అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. వంశధార నీరు శివారు వరకు రాకపోవడానికి వైసీపీ నాయకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. మత్స్యకారులకు కోల్డ్ స్టోరేజీలు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలాస కన్వీనర్ యార్లగడ్డ వెంకన్న చౌదరి, నేతలు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, పీరుకట్ల విఠల్‌రావు, దువ్వాడ శ్రీకాంత్, దానేటి పద్మజి, గురిటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మఖరజోల, చిన్న నారాయణపురం నుంచి..


టీడీపీలో చేరిన ఎంపీటీసీ సభ్యుడు మాధవరావు, అనుచరులతో గౌతు శిరీష

హరిపురం: మందస మండలం మఖరజోల (పిడిమందస ప్రాదేశికం) ఎంపీటీసీ సభ్యుడు వావిలపల్లి మాధవరావు 20 మంది అనుచరులతో గురువారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. నారాయణపురం పంచా యతీ చినినారయణపురంలో వైసీపీ నుంచి సుమారు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ గత ఐదేళ్లగా మందస మండలం అభివృద్ధికి నోచుకోలేదని, మళ్లీ టీడీపీ వస్తే అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఎమ్మెల్యేగా గౌతు శిరీష, ఎంపీగా రామ్మోహన్ నాయుడులను గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో నేతలు కొర్ల కన్నారావు, బావన దుర్యోధన, దాసరి తాతారావు, రట్టి లింగరాజు, నవీన్, నారా యణ, జీకే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా కోశాధికారి 'లోతుగెడ్డ' టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన తులసీ వరప్రసాద్ తదితరులతో ఎన్డీఏ అభ్యర్థి మామిడి గోవిందరావు

పాతపట్నం/కొత్తూరు: వైసీపీ జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీ వరప్రసాద్ తన అనుచరులతో టీడీపీలో చేరారు. గురువారం వీరికి ఎన్డీఏ టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తులసీ వరప్రసాద్ మాట్లాడుతూ.. వైసీపీ పార్టీకి తొలి నుంచీ సేవలు చేసినందుకు బహుమతిగా తనను సస్పెండ్ చేసిందన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావుకు సంపూర్ణ మద్దతిచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తా మన్నారు. మామిడి గోవిందరావు మాట్లాడుతూ.. పార్టీలో చేరిన తులసీ వరప్రసాద్‌కు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. టీడీపీలో చేరిన వారిలో ఎంపీపీతో పాటు ఇద్దరు వైస్ ఎంపీపీలు, 30 మంది సర్పంచ్‌లు ఎంపీటీసీలు, 14 మంది మాజీ సర్పంచ్‌లు ఉన్నారు.

కమలం గుర్తుపై ఓటేసి రుణం తీర్చుకుంటాం


టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నేతలతో ఈశ్వరరావు

రణస్థలం: సామాజిక కార్యక్రమాలు చేపట్టి, ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్ది, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసిన మీకు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించుకుంటామని సంచాం గ్రామా నికి చెందిన ప్రజలు ఎన్డీఏ కూటమి ఎచ్చెర్ల బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావుకు హామీ ఇచ్చారు. గురువారం సంచాం పంచాయతీ పరిధిలో చెరువు పనుల వద్ద ఉపాధి వేతనదారులను ఈశ్వరరావు కలిశారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ కమలం గుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా, సైకిల్ గుర్తుపై ఓటు వేసి కలిశెట్టి అప్పలనాయుడును ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి సభ్యులు లంక ప్రభ, కోరాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమిలో 110 కుటుంబాలు చేరిక

మెంటాడ పంచాయతీ పరిధిలోని 110 కుటుంబాలు మాజీ ఎంపీటీసీ సీరపు పైడియ్యరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఎన్డీఏ కూటమిలో చేరారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

రణస్థలం: పరిశ్రమల్లో పనిచేసిన కార్మికులు అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని విశాఖ పట్నం రీజనల్ ఫైర్‌ఆఫీసర్ డి.నిరంజనరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం పైడిభీమవరంలోని ఓ పరిశ్రమలో అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. పరిశ్రమల్లో అగ్ని ప్రమాదం జరిగేటప్పుడు హోసెస్, హైడ్రెంట్స్, స్ప్రిం కలర్స్, ఎస్‌సీబీఏ సెట్, ఫోమ్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి జె.మోహన్‌రావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


మాక్ డ్రిల్ నిర్వహించి కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి


నందిగాం: మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డీఎస్పీ బాలచంద్రారెడ్డి

నందిగాం: ప్రశాంత ఎన్నికలకు ప్రతి ఒక్కరు సహకరించాలని టెక్కలి నియోజకవర్గ ఆర్వో నూరుల్ కమర్ అన్నారు. గురువారం సాయంత్రం నందిగాం, కాపుతెంబూరుల్లో పోలీస్ మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో పర్యటించి ఎన్నికలపై అవగాహన కలిగించారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎటువంటి వివాదాలకు తావిచ్చినా రౌడీషీట్ ఓపెన్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.పద్మావతి, ఎంపీడీవో జి.శివప్రసాద్, టెక్కలి సీఐ సూర్యచంద్రమౌళి, నందిగాం ఎస్‌ఐ మహ్మద్ అమీర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

నరసన్నపేట: నామినేషన్ల సమయంలో అభ్యర్థులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ త్రినాథరావు సూచించారు. గురువారం నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల నిబంధనల మేరకు నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరం వరకు ఎటువంటి వాహనాలను అనుమతించడం జరగదన్నారు. కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ముగ్గురినే అనుమతిస్తామన్నారు. 100 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యాక్రమంలో సీఐ ప్రసాదరావు, ఎస్‌ఐ అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐదు కోట్ల మంది ఓ పక్క.. జగన్ మరో వైపు

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు


గొల్లూరు ప్రచారంలో అచ్చెన్నాయుడుకు మేకపిల్లను అందిస్తున్న దృశ్యం

టెక్కలి: ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో ఐదు కోట్ల మంది ఓవైపు.. జగన్‌రెడ్డి మరోవైపు ఉన్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం రాత్రి నందిగాం మండలం గొల్లూరు, రాంపురం, రధజన బొడ్డపాడు పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ హయాంలో నందిగాం మండల రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకున్నామన్నారు. రాంపురం గ్రామానికి చెందిన వలంటీర్ కిక్కిరి ధనలక్ష్మి, వార్డు మెంబర్ పొట్నూరు గణేష్ టీడీపీలో చేరారు. వీరికి అచ్చెన్నాయుడు కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, జనసేన ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్, బీజేపీ ఇన్‌చార్జి అట్టాడ రవిబాబ్జీ, బూరె నరేంద్ర, రాంపురం సర్పంచ్ జోగారావు, గొల్లూరు నాని, మెట్ట పద్మావతి, కింగ్, బాలక్రిష్ణ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత

టెక్కలి: రానున్నది ఎన్డీఏ ప్రభుత్వమేనని అనేక సర్వే ఫలితాలు రుజువు చేస్తున్నాయని, మన కష్టాలు తీరనున్నాయని, ఈసారి కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో టీడీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 22న 10 గంటలకు తాను 50 వేల మందితో నామినేషన్ వేయనున్నా నని, మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు తరలిరావాలని కోరా రు. కార్యక్రమంలో నాయకులు బగాది శేషగిరి, బోయిన రమేష్, పినకాన అజయ్‌కుమార్, ఎల్ఎల్ నాయుడు, తర్ర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 90 వైసీపీ కుటుంబాలు

టెక్కలి/సంతబొమ్మాళి/మెళియాపుట్టి: టెక్కలి, సంతబొమ్మాళి మండలాల నుంచి పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. గురువారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కండువాలు వేసి ఆహ్వానించారు. సంతబొమ్మాళి మండలం సుగ్గువానిపేట నుంచి 20 కుటుంబాలు, గోవిందపురం పంచాయతీ నుంచి 50 కుటుంబాలు, టెక్కలి పంచాయతీ లచ్చన్న పేట నుంచి 20 కుటుంబాలు, బూరగాం పంచాయతీ మాజీ సర్పంచ్ గేదెల రమణయ్యతో పాటు 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి.

మెళియా పుట్టి సర్పంచ్ రేఖాన లక్ష్మి, వాసుతో పాటు ఉప సర్పంచ్ మాడుగుల భానోజీరావు, అనుచరులు పార్టీలో చేరారు. వీరికి అచ్చె న్నాయుడు కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్ర మంలో పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి, మాజీ ఎంపీపీ కర్రి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

21న ఆరోతరగతిలో ప్రవేశానికి పరీక్ష

ఈదులవలస (పోలాకి): ఈదులవలస ఆదర్శ పాఠ శాలలో ఈ నెల 21న ఆరో తరగతి ప్రవేశానికి కళాశాల ప్రాంగణంలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్య ర్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని ఆరోజు ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. 154 మంది విద్యార్థు లు పరీక్షలు రాస్తారన్నారు.

నిందితులకు టిక్కెట్లు ఇవ్వొద్దు

నరసన్నపేట: ఎస్సీ, ఎస్టీ కేసుల్లో నిందితులుగా ఉన్న వారికి పార్టీలు టిక్కెట్లు కేటాయించడం సరి కాదని దళిత సంఘ నాయకులు డి.రాజకుమార్, టి.నీలకంఠం అన్నారు. ఈమేరకు గురువారం అంబే డ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. శిరోమండనం కేసులో నిందితుడిగా ఉన్న తోట త్రిమూర్తులు, అలాగే ఎమ్మెల్సీ అనంతబాబుకు టిక్కెట్ ఇవ్వవద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కె.అన్నయ్య పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

టెక్కలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అట్ల సరోజినమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.

పంచాయతీల అభివృద్ధిపై వర్క్‌షాప్

టెక్కలి: గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులతో గురువారం డీఎల్పీవో ఐవీ రమణ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీల అభి వృద్ధి ముందస్తు ప్రణాళికల ద్వారా నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో డీపీఆర్సీ పేడాడ ఆనందరావు, ఈవోపీఆర్డీ మల్లేశ్వ రరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇన్‌ఫిల్ట్రేషన్ బావి వద్ద పనులు

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలంలో రక్షిత నీటి పథకం నుంచి కొళాయిల ద్వారా గురువారం తాగునీటి సరఫరా నిలిచిపోయింది. గొట్టా బ్యారేజీ దిగువన ఇన్‌ఫిల్ట్రేషన్ బావిలో పూడిక తీతపనులు చేపడు తుండడంతో నీటి సరఫరాలో అంతరాయం కలిగిందని ఈవో రాంబాబు తెలిపారు. శుక్రవారం యథావిధిగి నీటి సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ మండల అధ్యక్షుడికి గాయాలు

మెళియాపుట్టి: వసుంధర గ్రామం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో టీడీపీ మండల అధ్యక్షుడు భాస్కర్ గౌడ్‌కు గాయాలైనట్లు ఎస్‌ఐ టి.రాజేష్ తెలిపారు. భాస్కరగౌడ్ పర్లాకిమిడి నుంచి మెళియాపుట్టి వైపు ద్విచక్ర వాహనంపై వస్తుడంగా మెళియాపుట్టి నుంచి పర్లాకిమిడి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో అతని తలకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో భాస్కర్‌గౌడ్‌తో పాటు కోదండకు చిన్న చిన్న గాయాలైనట్లు తెలిపారు. వెంటనే వారిని పీహెచ్‌సీకి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అనం తరం మెరుగైన వైద్యం కోసం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అయితే ద్విచక్ర వాహనం తప్పించుకొని వెళ్లడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నగరంలో 4గంటల పాటు కరెంట్ కోత

శ్రీకాకుళం అర్బన్: నగరంలో చీకట్లు అలుముకున్నాయి. సుమారు 4 గంటల పాటు విద్యుత్ కోతతో నగరమంతా చీకటిగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బలగ, డేఅండ్‌నైట్, శాంతినగర్ కాలనీ, హడ్కో కాలనీ తదితర ప్రాంతాల్లో రాత్రి 8 గంటల నుంచి 11 వరకు ఈ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు.

స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్న ఈవీఎంలు

ఆమదాలవలస: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అవసరమైన ఈవీఎంలు గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్నాయి. నియోజకవర్గంలోని 259 పోలింగ్ కేంద్రాల్లో ఉపయోగించనున్న ఈవీఎంలను ఏఆర్‌వో కెవేణగోపాల్, పార్టీల ప్రతినిధులు వెంకట చిరంజీవినాగ్, రమణమూర్తి, బి.షన్ముఖరావు సమక్షంలో పరిశీలించి భద్రపరిచారు.

సూపర్ సిక్స్‌పై ప్రచారం

కంచిలి: టీడీపీ అభ్యర్థి బెందాళం అశోక్ ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా చేపట్టారు. గురువారం జాడుపూడి పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అవినీతి, అరాచక పాలనకు రానున్న ఎన్నికలతో ముగింపు పలకాలని కోరారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, లోళ్ల రాజేష్, టీడీపీ నాయకులు బంగారు కురయ్య, మాదిన రామారావు, పి.చినబాబు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త పాడె మోసిన ఎమ్మెల్యే అశోక్


కార్యకర్త పాడె మోస్తున్న అశోక్

కవిటి: బొరివంక గ్రామానికి చెందిన టీడీపీ మహిళా కార్య కర్త రెయ్యి భాగ్యశ్రీ ఆకస్మాత్తుగా బుధవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకుని అశోక్ గురువారం గ్రామానికి చేరుకొని కార్యకర్త ఇంటినుంచి శ్మశాన వాటిక వరకు పాడె ను మోసి సానుభూతి తెలిపారు. మండలంలో మంచి కార్య కర్తను కోల్పోయానన్నారు. ఆ కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటానన్నారు. పలువురు నేతలు సంతాపం తెలిపారు.

విజయమే లక్ష్యంగా ముందుకు సాగుదాం

అరసవల్లి, ఏప్రిల్ 18: విజయమే లక్ష్యంగా అందరూ ముందుకు సాగుదామని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో నగర డివిజన్ ఇన్‌చార్జిలు, రూరల్, గార నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరూ ఏకతాటిపైకి వచ్చి పార్టీ అఖండ విజయానికి నూతనోత్సాహంతో కృషి చేస్తామన్నారు. గత ఐదేళ్లగా శ్రీకాకుళం నియోజకవర్గంలో డివిజన్ ఇన్‌చార్జిలుగా, ఇతర బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారంతా ఆయా బాధ్యతల్లోనే కొనసాగుతారని, ఎటువంటి వివాదాలకు ఇక తావులేదని, విజయమే అంతిమ లక్ష్యంగా కృషి చేయాలని నేతలు కోరారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నేతలు పీఎంజే బాబు, సింతు సుధాకర్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, కొమ్మనాపల్లి వెంకట రామరాజు తదితరులు పాల్గొన్నారు.

కింతలి నుంచి 95 వైసీపీ కుటుంబాలు చేరిక


కింతలిలో ప్రచారం చేస్తున్న ఎంపీ రామ్మోహన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

పొందూరు: మండలంలో వైసీపీకి పట్టున్న అతిపెద్ద గ్రామాల్లో ఒకటైన కింతలి నుంచి 95 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరాయి. సర్పంచ్ పైడి రామప్రసాద్, ఎంపీటీసీ కూటి కుప్పల హనుమంతురావు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు, అభ్యర్థి కూన రవికుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. ● టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపీ రామ్మోహన్ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. కింతలి గ్రామం లో గురువారం శంఖారావంలో భాగం గా ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, నాయకులు డి.సన్యాసిరావు, డి.గణపతి, కె.సత్యారావు, ఎ.రాము తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏతోనే అభివృద్ధి సాధ్యం: ఎంపీ


సారవకోటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: రాష్ట్రంలో అరాచక పాలన అంతమయ్యే రోజులు వచ్చాయని, ఎన్డీఏతోనే అభివృద్ధి సాధ్యమని ఉమ్మడి పార్టీ ఎంపీ అభ్యర్థి, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. జమ్ము, రావాడపేట గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి, జనసేన నియోజకవర్గ కన్వీనర్ బలగ ప్రవీణ్, టీడీపీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, రెడ్డి సతీష్, బగ్గు అప్పారావు, దుంగ సింహాచలం, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, బీజేపీ నాయకులు లక్ష్మణరావు, జనసేన నాయకులు లుకలాపు రంజిత్ తదితరులు పాల్గొన్నారు. ● అరసవల్లి: శ్రీకాకుళం పట్టణం, విశాఖ-బి కాలనీలో ఎంపీ రామ్మోహన్ సతీమణి శ్రావ్య, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సతీమణి స్వాతి కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థులు రామ్మోహన్ నాయుడు, శంకర్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ● జలుమూరు: రాష్ట్ర భవిష్యత్తు, పిల్లల భవిష్యత్తు కోసం రాష్ట్రంలో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీ అభ్యర్థి, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. రాణ, పెద్దదూగాం, కరవంజ, గుగ్గిలి, బసివాడ, టెక్కలిపాడు గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అభ్యర్థి బగ్గు రమణమూర్తి, జనసేన నాయకుడు బలగ ప్రవీణ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్ష డు వెలమల రాజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు. ● జగన్ పాలనలో రాష్ట్రాభివృద్ధి ఇరవై ఏళ్ల వెనక్కి వెళ్లిందని నరసన్నపేట ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. సారవకోటలో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నేతలు తేజకుమార్, కత్తిరి వెంకటరమణ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

జలుమూరు: చల్లవానిపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని తిలారు, జలుమూరు ఫీడర్లలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ఈఈ జి.శంకరరావు తెలిపారు. 11 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు చల్లవానిపేట, తిలారు, టెక్కలిపాడు, రావిపాడు, హరిక్రిష్ణమ్మపేట, దరివాడ, లింగాలవలస గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.